ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.17.11.2024 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. దేశంలో ఈ ఏడాది ధాన్యం దిగుబడిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచి రికార్డు సృష్టించింది.
2. ఇళ్లు కూల్చకుండా మూసీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.
3. రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్-3 పరీక్షలు ఈరోజు ప్రారంభమయ్యాయి.
4. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనులు వచ్చే జనవరిలో ప్రారంభమవుతాయని అధికారులు చెప్పారు.

------------------------

**వరి**

దేశంలో వరిసాగు ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. ఇంతకుముందు పంజాబ్ మొదటి స్థానంలో ఉండేది. అయితే ఈ వానాకాలం సీజన్ లో గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణలో 66.77 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరిని సాగు చేయగా, దిగుబడిలో కూడా 153 లక్షల టన్నులతో రికార్డు నమోదైంది. ఈసారి సన్న రకాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రచారానికి ఈసారి రైతుల నుంచి మంచి స్పందన లభించింది. దీంతో సన్నరకాల

సాగు భారీ ఎత్తున పెరిగింది. 57 రకాల సన్న బియ్యం వంగడాలను సాగు చేశారు. రాష్ట్రంలో వరి దిగుబడి రికార్డు స్థాయిలో పెరగడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాళేశ్వరం వల్లే తెలంగాణలో వరి సాగు పెరిగిందని బిఆర్ఎస్ ప్రచారం అవాస్తవమని, కాళేశ్వరంతో సంబంధం లేకుండా తెలంగాణ ఆవిర్భావం తర్వాత తొలిసారి రికార్డు స్థాయిలో పండిందని ఆయన అన్నారు. తెలంగాణ రైతులు దేశానికే గర్వకారణమని అభినందించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా తెలంగాణ రైతులను అభినందించారు.

**డెస్క్**

-------------------------------

**THUMMALA:**

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూర్యాపేట జిల్లా టేకుమట్లలో ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఐకేపి కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుడం పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కు మంత్రి ఈ సందర్భంగా  మంత్రి సూచించారు.

**పిటిసి, సూర్యాపేట**

---------------------------

**కిషన్ రెడ్డి**

పేద ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం యుద్ధం చేస్తుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. మూసీ పరివాహక ప్రాంతంలో రాత్రి బస చేసిన అనంతరం కిషన్ రెడ్డి ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... మూసీ పరివాహక ప్రాంత ప్రజల పరిస్థితి దయనీయంగా ఉందని, ఇళ్లు కులగొడుతున్నారన్న భయంతో కొందరు గుండెపోటుతో మృతి చెందారని ఆయన తెలిపారు. ప్రజాపాలన అంటే ఇళ్లు కూల్చడమా అని ఆయన ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కూల్చకుండా మూసీని అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు. కాగా, మూసీ సుందరీకరణకు బిజెపి వ్యతిరేకం కాదని పార్టీ పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. అలా అని పేదల ఇళ్లు కూలుస్తామంటే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఒప్పుకుంటే మూడింతల పరిహారం ఇచ్చి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**డెస్క్**

---------------------------

**<u>యాడ్ కిషన్ రెడ్డి</u>**

మూసీ నది ప్రాంతంలో బిజెపి చేపట్టిన రాత్రి నిద్ర కార్యక్రమంలో భాగంగా నిన్న రాత్రి 20 చోట్ల పార్టీ తెలంగాణ నేతలు బస చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో పాటు, రాజ్యసభ సభ్యుడు కే. లక్ష్మణ్, లోక్ సభ సభ్యుడు ఈటెల రాజేందర్, తదితరులు కూడా వేర్వేరు చోట్ల రాత్రి బస చేశారు.

**డెస్క్**

----------------------------

**కులగణన**

సమగ్ర కులగణనలో సేకరించిన వివరాలను అత్యంత భద్రంగా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఈ సర్వేలో సేకరించిన డేటాను ఒక ప్రత్యేక సాఫ్ట్ వేర్ లో ఎంట్రీ చేస్తారు. ఆ డేటా ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లలో రిజర్వేషన్ల పెంపుపై బిసి డెడికేటెడ్ కమీషన్ నిర్ణయం తీసుకుంటుంది.

**డెస్క్**

----------------------------------

**లీడ్ గ్రూప్ – 3**

రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్ – 3 రాత పరీక్షలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఈరోజు, రేపు జరిగే ఈ పరీక్షలకు అన్ని జిల్లాల్లో మొత్తం 1,401 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 5 లక్షల 36 వేల 395 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. పేపర్-1 పరీక్ష ఈ ఉదయం 10 గటలకు ప్రారంభమై, 12 గంటలకు ముగిసింది. పేపర్-2 పరీక్ష మద్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు జరుగుతుంది. పేపర్-3 పరీక్ష రేపు ఉదయం జరుగుతుంది. అభ్యర్థులను 2.30 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని అధికారులు చెప్పారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేలా పరీక్షా

కేంద్రాల వద్ద ఘట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

**DESK**

-----------------------------

**<u>గ్రూప్-3 జిల్లాలు</u>**

భద్రాద్రీ కొత్తగూడెం జిల్లాలో 39 కేంద్రాల్లో 19, 478 మంది అభ్యర్థులు గ్రూప్-3 పరీక్షలకు హాజరవుతున్నారు. కొత్తగూడెం లోని పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ తనిఖీ చేశారు. రుద్రంపూర్ లోని పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ పరిశీలించారు. ఆసిఫాబాద్ జిల్లాలో 18 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 4 వేల 500 మంది అభ్యర్థులు హాజరవుతున్నారు. బస్ స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులను చేర్చడానికి ప్రత్యేక ఉచిత వాహనాలు ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లాలో 66 కేంద్రాల్లో 19 వేల 941 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. రాజన్న సిరిసిల్లాలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పలు పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. మంచిర్యాల జిల్లాలో 15 వేల మందికి పైగా అభ్యర్థుల కోసం 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లాలో 21 పరీక్షా కేంద్రాల్లో 7 వేల 592 మంది పరీక్షలు రాస్తున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడలో పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన ఐదుగురు అభ్యర్థులకు పరీక్ష రాయడానికి అనుమతి నిరాకరించారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 10 వేల 656 మంది

అభ్యర్థులకు గాను 52.21 శాతం మాత్రమే ఈ ఉదయం పరీక్షకు హాజరైనట్లు అధికారులు చెప్పారు.

**PTC'S**

-------------------------------

**మెట్రో**

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనులు వచ్చే జనవరిలో ప్రారంభం కానున్నాయి. కారిడార్ 6 లో మహాత్మాగాంధి బస్ స్టేషన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఏడున్నర కిలో మీటర్ల మార్గానికి ఇరువైపులా రెండు వందల ప్రైవేట్ స్థలాలను సేకరించేందుకు హైదరాబాద్ కలెక్టర్ ప్రాధమిక అనుమతి తెలిపారు. మరో వైపు సికింద్రాబాద్ – కండ్లకోయ మధ్య 18.3 కిలో మీటర్లు, సికింద్రాబాద్ – శామీర్ పేట మధ్య 11.3 కిలో మీటర్ల మేర రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించనున్న ఎలివేటెడ్ కారిడార్లకు అవసరమైన ప్రభుత్వ, ప్రైవేట్ భూముల సేకరణకు రెవెన్యూ అధికారులు మరో నాలుగు రోజుల్లో ప్రాధమిక నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

**డెస్క్**

--------------------------------------

**దామోదర రాజనర్సింహ్**

ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వారి మాటలు నమ్మి మోస పోవద్దని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్ నిరుద్యోగులకు

సూచించారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్ మెంట్ బోర్డు ద్వారా గత 11 నెలల్లో 7 వేలకు పైగా పోస్టులు భర్తీ చేశామని, దాదాపు మరో 5 వేల వివిధ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పోస్టులకు నోటిఫికేషన్లు వస్తాయన్నారు.

**పిటిసి, సంగారెడ్డి**

-------------------------------

**<u>ఇందిరమ్మ ఇళ్లు</u>**

వరంగల్ లోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ భూ నిర్వాసితులకు 863 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో భాగంగా ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల చొప్పున మంజూరు చేస్తారు. గత ప్రభుత్వం మెగా టెక్స్ టైల్ పార్కు కోసం జిల్లాలోని గీసుకొండ, సంగెం మండలాల పరిధిలో 1,219 ఎకరాలను సేకరించింది.

**డెస్క్**

----------------------------------

**<u>యాడ్ ఇందిరమ్మ ఇళ్లు</u>**

రాజన్న సిరిసిల్లా జిల్లాలోని మిడ్ మానేర్ రిజర్వాయర్ నిర్వాసితులకు కూడా ప్రభుత్వం 4,696 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. మొత్తం 10,683 నిర్వాసిత కుటుంబాల్లో ఇప్పటికే దాదాపు సగం మందికి ఇళ్లు కేటాయించగా, మిగిలిన వారికి ఇప్పుడు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను జారు చేసింది.

**డెస్క్**

--------------------------------

**ఆయిల్ ఫామ్**

ఆయిల్ పామ్ సాగు వల్ల రైతులకు అధిక లాభాలు వస్తాయని రాజన్న సిరిసిల్ల ఉద్యానవన శాఖ డివిజనల్ అధికారి గోవర్ధన్ అన్నారు. ఆయిల్ పామ్ మొక్క ధర 190 రూపాయలు ఉండగా, ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో ఒక మొక్కను 20 రూపాయలకే అందజేస్తోందని ఆయన చెప్పారు. అంతర పంటల సాగుకు ఎకరానికి 4 వేల 200 రూపాయల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఇస్తారని, డ్రిప్ ఇరిగేషన్ కు కూడా ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని గోవర్ధన్ తెలిపారు.

**పిటిసి, రాజన్న సిరిసిల్ల**

-----------------------------

**కల్లుగీత కార్మికులు**

కల్లుగీత కార్మికులకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో రాయితీపై మోపెడ్లను అందజేస్తామని రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి నిన్న హుస్నాబాద్ లో గీత కార్మికులకు కాటమయ్య కిట్లను పంపిణి చేశారు. తాటి చెట్టు ఎక్కే ప్రతి కార్మికునికి ఈ రక్షణ కిట్లను అందజేస్తామని ఆయన చెప్పారు. తక్కువ ఎత్తులో పెరిగే తాటి చెట్ల అభివృద్ధికి పరిశోధనలు జరుగుతున్నాయని ప్రభాకర్ చెప్పారు.

**డెస్క్**

--------------------------------

**<u>పోలీస్</u>**

పోలీస్ యూనిఫామ్ లో తెలంగాణ ప్రభుత్వం మార్పులు చేసింది. ఇప్పటి వరకు యూనిఫామ్ లోని బ్యాడ్జిలో తెలంగాణ స్టేట్ పోలీస్ – TSP అనే అక్షరాలు ఉండేవి, ఇకపై తెలంగాణ పోలీస్ – TGP గా మార్చాలని నిర్ణయించారు. అలాగే పోలీసులకు సంబంధించిన TSSP స్థానంలో TGSP తో పాటు TSPS కు బదులు, TGPS అనే అక్షరాలు బ్యాడ్జీలు వాడాలని ఆదేశించారు.

**డెస్క్**

---------------------------------

**<u>లైబ్రరి</u>**

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతి రోజు ఒక గంట సేపు గ్రంథాలయంలో గడిపితే విజ్ఞాన వంతులవుతారని అన్నారు.

**పిటిసి, మహబూబాబాద్**

------------------------

**<u>ఉర్సూ</u>**

ఆంధ్రప్రదేశ్ లోని కడప, అమీన్ పీర్ పెద్ద దర్గా ఉర్సూ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధానమైన గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి యేటా జరిగే ఈ ఉర్సూ ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారు. ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి గంధ మహోత్సవంలో పాల్గొన్నారు.

డెస్క్

-----------------------------------

<u>**ఎయిర్ ఇండియా**</u>

ఎయిర్ ఇండియా శీతాకాల సర్వీసుల్లో భాగంగా అదనపు సర్వీసులను ప్రకటించింది. హైదరాబాద్, గ్వాలియర్ డైరెక్ట్ సర్వీస్, విశాఖపట్నం, విజయవాడ సర్వీసు ఇందులో ఉన్నాయి. అలాగే హైదరాబాద్ నుంచి బెంగళూరు, కొచ్చికి సర్వీసుల సంఖ్య పెంచారు. వీటితో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల నుంచి వారంలో నడిచే సర్వీసుల సంఖ్య 173 నుంచి 250 కి పెరిగింది.

డెస్క్

------------------------